# పిల్లలున్నారు జాగ్రత్త

తాయారమ్మ ఎదురింటివైపు చూసింది. ఆ ఇంట్లోకి కొత్తగా ఎవరో వారం క్రితం దిగారు. ఆ ఇంటావిడని పరిచయం చేసుకోవాలని తాయారమ్మకి తెగ ఉబలాటంగా ఉంది.

తాయారమ్మకి తట్టుకోవటం చాలా కష్టమై బరబరా వళ్ళంతా గీరుకో సాగింది.

"మరీ అంత దురదగా ఉంటే వెళ్ళి ఇప్పుడే పరిచయం చేసుకో రాదూ ఎందుకలా రక్తం కారేలా వళ్ళంతా గోక్కుంటావ్?...."అన్నాడు భర్త వెంకటరత్నం.

తాయారమ్మ సిగ్గుతో తల వంచుకుంది.

"ఊ.... ఊ.... బయలుదేరుమరి— నువ్విట్లానే గోక్కుంటూ ఉంటే నీకు తామర ఉందని అనుకుంటారు చూసినవాళ్ళెవరైనా...."

ఇంక ఓపలేక తాయారమ్మ చెంగున వీధిలోకి గెంతింది.

అలా గెంతుకుంటూ వెళ్ళినావిడ ఎదురింటి కాంపౌండ్ వాల్ గేటు దగ్గర ఆగిపోయింది.

కారణం.... అక్కడ బోర్డుంది. "కుక్కలున్నాయి జాగ్రత్త" అని.

ఆ బోర్డువంక బిక్కుబిక్కుమని చూస్తూ గేటుదగ్గరికి వెళ్ళి లోపలికి తొంగిచూసింది.

వరండాలో ఆడుకుంటున్న నాలుగేళ్ళ బాబు తాయారమ్మని చూసి గట్టిగా అరిచాడు — "ఇప్పుడేం లేదు.... అలా ముందుకెళ్ళు!" అని. తాయారమ్మ అనుమానంగా ఒకసారి తన చీరవంక చూస్కుని "కెవ్వు" మంది.

ఎదురింటావిడని పరిచయం చేసుకోవాలన్న ఆతృతలో వంటగదిలో మసి పట్టేసిన చీరతోనే అలానే వచ్చేసింది.

తనుచేసిన పొరపాటుకి నాలుక కొరుక్కుని ఇంటికి పరుగెత్తింది.

"ఏం?.... అప్పుడే తిరిపోయిందా?" అడిగాడు వెంకటరత్నం భార్యకేసి ఆశ్చర్యంగా చూస్తూ.

"అబ్బే!.... అక్కడా అసలు ఇంట్లోకి కూడా అడుగుపెట్టందే. ఇప్పుడే చీర మార్చుకుని వెళ్తాను" అంది.

తాయారమ్మ గబగబా చీర మార్చుకుని మళ్ళీ చెంగున దూకి ఎదురింటి కాంపౌండ్ వాల్‌గేటు దగ్గర నిల్చుంది,

ఇందాక "అలా ముందుకెళ్ళు" అని అరిచిన బాబే వరండాలో నిల్చున్నాడు.

వాడు తాయారమ్మని చూస్తూనే మొహం చిట్లించాడు.

"ఇందాక మసి కొట్టుకుపోయిన చీరతో వచ్చావ్ ఇప్పుడేమో మంచిచీర కట్టుకుని వచ్చావ్....ఎవరింట్లో కట్టుకొనివచ్చావేంటీ?"అన్నాడు

తాయారమ్మ బిత్తరపోయింది.

"నేను అలాంటిదాన్ని కాదు బాబూ.... నేను ఎదురింటి ఆంటీని.. మీ అమ్మని చూద్దామని వచ్చాను—" అంది తెల్లమొహం వేస్కుని.

"మరి ఆ మాట ఇందాకే చెప్పొచ్చుగా.... లోపలికి రండి...." అన్నాడు ఆ అబ్బాలు చికాకుగా మొహంపెడుతూ.

"మీ ఇంట్లో కుక్కుండేమో!?...." భయంగా అడిగింది తాయారమ్మ.

"మరేం పర్లేదు— దాన్ని స్థంబానికేసి కట్టేశాం—"

తాయారమ్మ గేటు తెరుచుకుని లోపలికి అడుగుపెట్టింది.

"అమ్మోయ్— నీకోసం ఎవతో బోండాం వచ్చింది" లోపలికి చూస్తూ అరిచాడు ఆ అబ్బాయి.

లోపలినుండి ముప్పయి ఏళ్ళావిడ గబగబా బయటికి వచ్చింది. అవిడ పాలిపోయిన మొహంతో నిల్చుని ఉన్న తాయారమ్మని చూసింది.

"మీరు?—" ప్రశ్నార్థకంగా చూసింది.

"నేను ఎదురింట్లో ఉంటానమ్మా— ఎదురుబొదురుగా ఉండేవాళ్ళం కదా. పరిచయం చేస్కుందామని వచ్చాను. నాపేరు తాయారమ్మ"అంది.


"నా పేరు జానకి — వాడేమో మా అబ్బాయ్ డింగరి —" అంది జానకి.

తాయారమ్మ డింగరివైపు భయంగా చూ ంది.

"వాడి మాటలకి మీరేమీ అనుకోకండి. మాతోబాటు ప్రతి తెలుగు సినిమాకి వస్తాడు — అందుకే వాడికా ముదురు మాటలు! మీరు లోపలికి రండి" అంది జానకి లోపలికి దారితీస్తూ.

తాయారమ్మ జానకిని అనుసరించింది.

"హిహిహి —" అని నవ్వుతూ డింగరి కూడా తాయారమ్మని అనుసరించాడు.




తాయారమ్మ భయం భయంగా డింగరివైపు చూస్తూ సోఫాలో కూర్చుంది. ఇంతలో లోపల్నుండి రెండు సంవత్సరాల పాప వచ్చింది.

"అమ్మా.. అమ్మా. ఈవిడెవరు?" అని అడిగింది.

"ఈమె ఎదిరింటి ఆంటీ —" చెప్పింది జానకి.

"ఏం కాదు. ఎదులింతి పిచ్చిది" అంది పాప.

"ఈ పాపకూడా తెలుగు సినిమాలు బాగా చూస్తుందా?" తాయారమ్మ పాపవంక భయంగా చూస్తు అంది.

"చిన్నదాన్ని ఇంట్లో వదిలెలా వెళ్తాం— అందుకే దాన్ని మా

కూడా సినిమాలకి తీస్కెళ్తాం.... పాపా — డింగరీ మీరిద్దరూ బయటి కెళ్ళి ఆడుకోండమ్మా. నేనూ ఆంటీ మాట్లాడుకుంటాం" అంది జానకి.

"ఉహూ — మేం ఇక్కడే కూర్చుంటాం.... ఆంటీని చూస్తుంటే భలే గమ్మత్తుగా నవ్వొస్తూ ఉంది — హిహి —" అన్నాడు డింగరి.

ఇద్దరు పిల్లలూ తాయారమ్మకి ఎదురుగా కూర్చున్నారు. తాయారమ్మ సోఫాలో ఇబ్బందిగా కదిలింది.

జానకి తాయారమ్మ కాస్సేపు కబుర్లలో పడ్డారు.

"అమ్మా కాఫీ పట్రావే— అదిస్తేగానీ కదిలేలా లేదు. ఆంటీ — హి—" అన్నాడు డింగరి.

"ఏయ్ పిచ్చమ్మీ కాఫీ తాగుతావా?" అని అడిగింది పాప తాయారమ్మని.

"చూశారా— మా పిల్లలు మీకెలా మర్యాద చేస్తున్నారో మీ కోసం కాఫీ తెమ్మని నాకు గుర్తు చేస్తున్నారు...."అని జానకి మురిసిపోతూ పిల్లల వంక చూసింది.

"అబ్బే — ఇప్పుడు కాఫీ ఎందుకు లెండి—" ఇబ్బందిగా కదుకదులుతూ అంది తాయారమ్మ.

"కూల్ డ్రింక్ కోసం ప్లాన్ వేస్తున్నట్లుందే అమ్మా—" అన్నాడు డింగరి కళ్ళెగరేస్తూ.

"అమ్మా — అశ, దోశ, అప్పలం, వడ" అంది పాప.

"ఫరవాలేదు — ఒక్క నిముషంలో కాచిపట్టుకొస్తాగా!"

జానకి వంట గదిలోకి వెళ్ళింది.

ఆ గదిలో తాయారమ్మ పిల్లలిద్దరూ మిగిలారు.

పిల్లలు తననే రెప్పవాల్చకుండా చూస్తుంటే తాయారమ్మ గుండెల్లో గుబులు పట్టింది. వాళ్ళిద్దరూ రెప్పవాల్చకుండా అవిడనే చూస్తున్నారు. ఎప్పుడేమంటారోనని భయంతో హడలి చస్తుంది ఆమె.

ఆవిడని చూస్తూ మధ్యమధ్య ఒకరి మొహం ఒకరి చూస్కొని "హిహి — హిహి—" అని నవ్వుకుంటున్నారు పిల్లలిద్దరూ. తాయారమ్మకి నవ్వాలో ఏడవాలో తెలీలేదు తన పరిస్థితికి.

వాళ్ళని చూసి బలవంతంగా నవ్వు తెచ్చి పెట్టుకుని "హిహిహి" అని నవ్వింది.

వెంటనే పిల్లలిద్దరూ కిలకిలా నవ్వారు.

"ఆంటీ పళ్ళు వంకర టింకరగా భలే గమ్మత్తుగా ఉన్నాయ్ కదూ?" అంటూ పాపని అడిగాడు డింగరి.

అవున్లా అన్నయ్యా.... ఆంతీకి పుత్తిపల్లు కూడా ఉన్నాయ్ కదు. ఆంతీ?" అంది పాప.

"ఏదీ— మళ్ళీ హిహి అని నవ్వు ఆంటీ చూద్దాం—" అన్నాడు డింగరి.

ఇంతలో జానకి రెండు కప్పుల్లో కాఫీ పట్టుకొచ్చింది.

"ఒరేయ్— ఏంట్రా మీ గోల ఏమీ తోచనివ్వకుండా — ఆంటీని కాపీ తాగనివ్వండి" అంది జానకి తాయారమ్మకి కాపీ కప్పుని అందిస్తూ.

"మరలాగైతే తాగాక హిహి అని నవ్వాలి యేం అట్లాగేనా? —" అన్నాడు డింగరి.

తాయారమ్మ బిక్క మొహం వేస్కొని జానకి వంక చూసింది.

"ఒరేయ్— మీరు గోల చెయ్యకుండా కూర్చోండి. లేపోతే బైట కెళ్ళి ఆడుకోండి— మీరు కాపీ తాగండి" అంది జానకి.

తాయారమ్మ బిక్కు బిక్కుమంటూ కాపీ సిప్ చేయసాగింది.

తాయారమ్మ కాపీ తాగడం చూసిన పాప కిలకిలా నవ్వింది.

"ఆంటీ మూతి ముందుకు పెట్టి కాపీ తాగుతుంటే అచ్చు జాంబవతిలా ఉంది కదలా అన్నయ్యా?"

"అవును — అంజీలు స్వామి చెల్లెలులా ఉంది" అన్నాడు డింగరి

తాయారమ్మకి పొరబడి దగ్గొచ్చేసింది.

ఇంతలో సర్పిన కుక్క వచ్చి తాయారమ్మ ఎదురుగా నిల్చుని "గుర్ ర్ —" అంది.

"బాబోయ్ కుక్క! దీన్ని దూరంగా లాక్కెళ్ళండి — " అంది తాయారమ్మ కాళ్ళు రెండూ పైకెత్తి సోఫామీద పెడుతూ.

అప్పుడే లోపలికి విసురుగా ఒక ఆరేళ్ళబ్బాయి వచ్చాడు.

"వీడు మా పెద్దబ్బాయి—పేరు రవి—" అంది జానకి.

"అద్సరేగానీ ఈవిడెవరమ్మా?— కుక్కంటుందేమిటీ" కోపంగా అరిచాడు రవి.

తాయారమ్మ తన ఎదురుగా నాలుక చాపుకుని నిల్చున్న జంతువుని పరీక్షగా చూసింది. అది కుక్కే— సందేహం లేదు.

"ఇది కుక్కేగా?—" అంది.

"అదిగో మళ్ళీ—" గట్టిగా అరిచాడు రవి. "ఇంకోసారలా అంటే ఉస్కో అని దాంచేత కండ పీకించేస్తాను."

"దాని పేరు రాణీ అండీ. దాన్ని పేరుతోనే పిలవాలి— కుక్కా, నక్కా అంటే వాడికి కోపం వస్తుంది" అంది.

"రాణీ— హిహి— చాలా బాగుంది. రాణీ!" బలవంతంగా నవ్వుతూ అంది తాయారమ్మ.

తరువాత రాణీ సోఫా ఎక్కి తాయారమ్మ బుగ్గలూ మెడా నాకసాగింది.

"నువ్వు కదలకాంటీ దానికి కోపం వచ్చి కండ పీకేస్తుంది—" అన్నాడు డుంబు.

రాణీ తాయారమ్మ మొహాన్ని కాస్సేపు నాకి లోపలికి వెళ్ళిపోయింది.

బ్రతుకు జీవుడా అనుకుంది తాయారమ్మ.

"ఇంక నేనొస్తానమ్మా" అంటూ లేచింది.

"అప్పుడప్పుడూ వచ్చిపోతుండండి—" అంది జానకి.

"అలాగే" అని ఇంట్లోంచి బయటికి వచ్చి వెనక్కి చూసింది. కుక్కలున్నాయి జాగ్రత్త బోర్డు కనిపించింది. దాని బదులు పిల్లలున్నారు జాగ్రత్త అని బోర్డుంటే బాగుండేది అనుకుంది తాయారమ్మ.

ఆరోజు తరువాత మళ్ళీ ఎదురింటికి ఎప్పుడూ వెళ్ళలేదు ఆమె.

*